క్లుప్తంగా

అక్రమ నిర్మాణం అడ్డగింత



ఖలీల్‌వాడి: నగరంలోని నిజాంకాలనీలో నాలాను ఆక్రమించుకొని షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఫిర్యాదు రావడంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అనుపమ, నార్త్‌తహసీల్దార్, పోలీసులు అడ్డుకున్నారు. షెడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయించారు. షెడ్ యాజమాని సంఘం మాట్లాడుతూ షెడ్డుకు సంబంధించిన పత్రాలు ఉన్నట్లు తెలిపారు.

నర్సరీల పరిశీలన



నిజామాబాద్ రూరల్: మండలంలోని ధర్మారం (ఎం) గ్రామంలో మంగళవారం నర్సరీని ఎంపీడీవో మల్లేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లోని పల్లె ప్రకృతివనం, నర్సరీలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. లక్ష్యంమేర మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. అనంతరం నర్సరీలో ఉన్న మట్టిని ట్రాక్టర్ సహాయంతో చదును చేయించారు. జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూపతిరెడ్డి గెలుపు కోసం పాదరక్షలు వదిలేసి..



సిరికొండ: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా డాక్టర్ భూపతిరెడ్డి గెలిచే వరకు చెప్పులు వేసుకోనని మైలారం గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌గౌడ్ శపథం చేశాడు. భూపతిరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ రావాలని, టికెట్ వచ్చి ఎమ్మెల్యేగా గెలవాలని ఆయన రెండు నెలల కిందట చెప్పులను వదిలేశాడు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటికి సంతోష్ ఇంకా చెప్పులను ధరించడం లేదు. ఎమ్మెల్యేగా భూపతిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చెప్పులను ధరిస్తానని సంతోష్‌గౌడ్ తెలిపారు.

పొరాదేవికి తరలిన కాంగ్రెస్ నేతలు



మోపాల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా డాక్టర్ భూపతిరెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో మండలంలోని ముదక్‌పల్లికి చెందిన గిరిజన నాయకులు మహారాష్ట్రలోని పొరాదేవికి మంగళవారం తరలివెళ్లారు. అనంతరం వారు జగదాంబ మాతా, సేవాలాల్ మహారాజ్, రామారావు మహారాజ్ దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా నాందేడ్‌లోని గురుద్వారాలో పూజలు చేశారు. నాయకులు కెతావత్ సురేష్ నాయక్, బాదావత్ రతన్, దేవావత్ ప్రభాకర్, బానోత్ మోహన్, బాదావత్ గోవింద్, నవదీప్ పాల్గొన్నారు.

మైనారిటీ యువకుల ధర్నా



ఖలీల్‌వాడి: నగరంలోని గాంధీచౌక్ వద్ద మంగళవారం మైనారిటీ యువకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీకి కొంత మంది సపోర్ట్ చేయడంపై భైంసా ఎంఐఎం నేత సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలను వారు ఖండిస్తూ, ధర్నా చేశారు. అనంతరం సీపీ కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా అర్హులైన గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భవతులకు పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలు ఆరోగ్య పరీక్షలను ఎప్పటికప్పుడు చేసుకోవాలని సూచించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఆదమరిస్తే అంతే సంగతి





నగరంలోని బైపాస్ రోడ్డు పక్కన డ్రెయినేజీ కనిపించకుండా ఏపుగా పెరిగిన మొక్కలు

- బైపాస్ రోడ్డు పక్కన ప్రమాదకరంగా డ్రెయినేజీ
- ఏపుగా పెరిగిన మొక్కలతో కనిపించని వైనం
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల గేటు నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఒక వైపు ఓపెన్ ప్లాట్లు దారిపొడవున ఉన్నాయి. మరోవైపు పెద్ద డ్రెయినేజీ ఉండగా ఏపుగా పెరిగిన మొక్కలు, వృక్షాలతో వాహనదారులకు కనిపించకుండా ఉంది. దీంతో వాహనదారులు ఆదమరిస్తే వాహనాలు చెట్ల పొదలనుంచి డ్రెయినేజీలో పడే అవకాశం ఉంది. సుమారు 50 మీటర్ల దూరం అత్యంత ప్రమాదకరంగా ఉంది. అలాగే రెండు మూలమలుపులతోపాటు ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

భయాందోళనలో వాహనదారులు..

ఈ బైపాస్ రోడ్డు బాగుండడంతోపాటు దూరం తగ్గడంతో పెద్దగా ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదని చాలా మంది ఈ వైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కానీ జీజీ కళాశాల ఆవరణను ఆనుకొని అత్యంత ప్రమాదకరంగా డ్రెయినేజీ కాలువ పారుతుంది. కానీ రోడ్డు పక్కన మొక్కలు ఏపుగా పెరగడంతో ఈ డ్రెయినేజీ వాహనదారులకు కనిపించకుండఉంది. దీంతో రహదారి గుండా కాస్త వేగంగా వచ్చి అదుపు తప్పితే ఇక అంతేసంగతులు. ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీకి రక్షణ లేకుండా పోయింది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో బైపాస్ రోడ్డు వెడల్పు పనుల్లో చిన్న పాటి బ్రిడ్జి నిర్మించి వదిలేశారు. 50మీటర్ల పొడవు ఉన్న డ్రెయినేజీకి ఎలాంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేయలేదు. అప్పుడప్పుడు పెద్ద పెద్ద వాహనాలు సైతం ఈ వైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వెంబడి వెంటనే రక్షణ కవచం ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అర్బన్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ





ధన్‌పాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ధన్‌పాల్ సూర్యనారాయణకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సంఘాలు, యూనియన్లు, డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు తరలివస్తుండటంతో ఆయన కార్యాలయమంతా సందడిగా మారింది. ఈసందర్భంగా పలువురు డివిజన్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొస్తున్నారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాయవార్ రాజేశ్వర్, అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్నీ కుమార్ రాపాక, వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయ, విద్యార్థి, ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్, అర్బన్ న్యూస్ పేపర్ ఏజెంట్స్, బాయ్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్, రమేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందించారు. సన్మానాలు చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కేసీఆర్‌ను కలిసిన బాజిరెడ్డి



మోపాల్: మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం ఎర్రవల్లిలోని ఫాంహౌజ్‌లో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించడంతోపాటు బీఆర్ఎస్ తరపున మూడోసారి అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్‌కు బాజిరెడ్డి గోవర్దన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. కార్యకర్తలకు అండగా ఉండాలని, ఎవరూ అధైర్యపడకుండా భరోసానివ్వాలని ఆయన సూచించారని పేర్కొన్నారు. ప్రభుత్వ లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ, ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారని బాజిరెడ్డి తెలిపారు.

ఘనంగా ఘంటసాల జయంతి



గాయకులను సన్మానిస్తున్న సమాఖ్య సభ్యులు

నిజామాబాద్ సిటీ: తెలుగు జాతి స్వరపుత్రుడిగా ఎనలేని సినీ లలిత సంగీత సేవలందించిన ఘంటసాల జయంతిని మంగళవారం నగరంలో తెలుగు వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఘంటసాల ప్రత్యేక సంగీత విభావరికి, ప్రముఖ కథారచయిత దారం గంగాధర్ ముఖ్యఅతిథిగా, అష్టావధాని గణపతి అశోక్ శర్మ, విశిష్ట అతిథి కవి విపి చందన్‌రావు సభకు అధ్యక్షత వహించారు. సంస్థ కార్యదర్శి బి చంద్రశేఖర్ ఘంటసాల ప్రతిభా విశేషాలను వివరించారు. పలువురు గాయకులను సన్మానించారు. అయాచితం నాగరాజశర్మ, వేముల శేఖర్, రామ సూర్యప్రకాశ్‌రావు, సముద్రాల రాములు, నరసింహం, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం కుర్చీలను వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పట్వారి తులసి కుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు చైర్మన్ కోట నరేష్, సభ్యులు శశిధర్, ఉపాధ్యాయులు కిషన్, అనిల్ పాల్గొన్నారు.

పీజీలో ఖాళీ సీట్లను భర్తీ చేయాలి



తెయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పీజీ సీట్లను వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆయన వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం క్యాంపస్ పీజీ అడ్మిషన్లలో అన్ని కోర్సులలో కలిపి సుమారు 200 సీట్లు మిగిలిపోయాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్పాట్ అడ్మిషన్స్ ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేయాలని కోరారు. నాయకులు శివసాయి, ఆకాష్, హన్మాండ్లు, అశ్విత్, తరుణ్, రాము, రాజు, మన్యంకొండ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బీచ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం విద్యార్థులను, పీఈటీ మధును హెచ్‌ఎం హరిత, సర్పంచ్ సుమలత అభినందించారు. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-14 విభాగంలో బాలురు, అండర్-17 విభాగంలో బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 8నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి



ఆరోగ్య కేంద్రంలో సమావేశమైన ఆరోగ్య సిబ్బంది

ఇందల్వాయి: ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని, గర్భిణులు తమ పేర్లను ఆరోగ్యకేంద్రాల్లో నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఆరోగ్య సిబ్బందికి హెచ్ఈవో శంకర్, వైద్యుడు సంతోష్ సూచించారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వారు ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. చలికాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సిబ్బంది అక్బర్ అలీ, వెంకట్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలని ధర్నా



ధర్నా చేస్తున్న బార్దాన్ కార్మికులు

ఖలీల్‌వాడి: నగరంలోని కిసాన్‌గంజ్‌లోని వ్యవసాయ మార్కెట్ ద్వారం వద్ద మంగళవారం బార్దన్ కార్మికులు కూలీ రేట్లు పెంచాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్మిక సంఘం నేత, బార్దాన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మల్యాల గోవర్దన్ మాట్లాడుతూ.. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ కూలీ రేట్లు పెంచాలేమని తెల్పడంతో కార్మికులు సమ్మె బాట పట్టినట్లు తెలిపారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని, యాజమాన్యాలు కూలీలతో చర్చలు జరపాలన్నారు. కార్మిక శాఖ అధికారులు చొరవ చూపి, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. నాయకులు దండే రాము, అబ్దుల్, విజయ్, రాజు, సురేష్, గంగాధర్, కరుణబాయి, భారతి, కార్మికులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో నర్సరీలు సిద్ధం చేయాలి



దూస్‌గాం గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: హరితహారం కోసం ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఒక్కో నర్సరీలో 10 మొక్కలు పెంచేలా పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ ఆదేశించారు. ఇందుకోసం నల్లమట్టి, ఎర్రమట్టి, కంపోస్టు ఎరువులతో కూడిన బ్యాగులను సిద్ధం చేసుకోవాలన్నారు. మండలంలోని దూస్‌గాం, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లోగల నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. పాతవాటిని సంరక్షించుకుంటూ కొత్త మొక్కలు సిద్ధం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు గుర్తించాలన్నారు. వ్యవసాయ పంటభూములకు వెళ్లే రోడ్లు, గ్రామాల్లో అంతర్గత మట్టి రోడ్లకు సంబంధించిన పనులను ఉపాధి హామీ కింద చేపట్టవచ్చన్నారు. పని అడిగిన ప్రతి ఒక్క కూలీకి పని కల్పించాలని ఆదేశించారు. భూగర్భ జలాల పెంపుకోసం ఊట కుంటలు, కందకాలు నిర్మించాలన్నారు. ఏపీవో సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు కుందెన్ ఉమేష్, పరమేష్, పంచాయతీ కార్యదర్శి వినయ్, మేట్ ప్రవీణ్, కారోబార్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



డిచ్‌పల్లిలో..



సిరికొండలో..

డిచ్‌పల్లి/సిరికొండ/ఖలీల్‌వాడి: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటు నినాదాలు చేశారు. జిల్లా కాంగ్రెస్ సేవాదళ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సంతోష్, వేణురాజ్, ఆశ్రాఫ్, సిరికొండ పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఆసిఫ్, ప్రేమ్, సలాం, రాజ్ కుమార్, ప్రశాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు తీర్చాలి



ఇందల్వాయి: రూరల్ నియోజకవర్గంలో ముదిరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి కోరారు. మంగళవారం ఆయన రూరల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన డా.భూపతిరెడ్డిని కలిసి, అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో ముదిరాజ్‌ల సమస్యలు తీర్చాలని, ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలందరికి అందేలా కృషి చేయాలని ఆయన ఎమ్మెల్యేకి విన్నవించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-2: యానిమల్(హిందీ) 9.30; యానిమల్(తెలుగు) 1.15; సామ్ బహదూర్(హిందీ) 5.00, 7.50, 10.40
- స్క్రీన్-3: యానిమల్(హిందీ) 11.10, 3.00, 10.30; యానిమల్(తెలుగు) 6.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: యానిమల్(తెలుగు.9.00.1.00, 5.00, 9.00
- స్క్రీన్-2: యానిమల్(హిందీ) 10.00.2.00, 6.00, 10.00
- స్క్రీన్-3: సామ్ బహదూర్(హిందీ) 12.40, 3.50, 7.00, 10.10
- స్క్రీన్-4: పల్లె గూటికి పండుగొచ్చింది(తెలుగు), 10.00; అద్దా(తెలుగు) 3.50; సహస్ర(తెలుగు) 6.40; రాథోడ్(తెలుగు) 9.45
- దేవి: ఆదికేశవ(తెలుగు)
- నటరాజ్: అథర్వ(తెలుగు)
- లలితామహల్: యానిమల్(తెలుగు)
- విజయ్: యానిమల్(హిందీ)

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	15	30	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,050	వెండి (కిలో)	78,500
22 క్యారెట్స్	58,130		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఖలీల్‌వాడి: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని ఓ ప్రైవేట్ గెస్ట్ హౌస్ పై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా, 17 మంది పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి నుంచి రూ.1.43 లక్షలు, తొమ్మిది కార్లు, 16 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో కొంతమంది ప్రముఖులు, పేకాట నిర్వాహకులు ఉన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి

బోధన్: మానవాళి మనుగడకు మూలాధారమైన భూమిని, భూసారాన్ని కాపాడుకోవాలని రుద్రూర్ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, అవసరం మేరకే రసాయనిక మందుల వాడకం ఉండాలన్నారు. మండలంలోని హున్సా జెడ్పీహెచ్ఎస్‌లో ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవా రం పరిశోధన కేంద్రం అధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి కలుషితం కాకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.